క్లుప్తంగా

చినుకుపాటికే జలమయం



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఎస్‌బీఐ వద్ద డ్రైన్ల మూసివేతతో రోడ్డుపై నిలచిన నీరు

సామర్లకోట: కొద్ది వర్షానికే మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు జలమయమయ్యాయి. శనివారం మధ్యాహ్నం అరగంట పాటు వర్షం కురిసింది. దాంతో పెద్దాపురం రోడ్డు, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్, అయోధ్యరామపురం, సంపెంగ తోటలోని రోడ్లు వర్షపు నీటితో నిండి పోయాయి. ఆయా రోడ్ల మార్జిన్‌లో ఇరు వైపులా ఉన్న డ్రైన్లను మూసివేయడంతో వర్షపు నీరు పాయే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోయింది.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ రైల్వేస్టేషన్ సమీపంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. తొలుత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.2.83 లక్షలు



శంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామిని అలంకరించి, భక్తులకు ఆశీర్వచనం ఇచ్చారు. అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజే సుమారు 2,83,405 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు.

పొలారిటీ ధ్యానంతో పాజిటివ్ శక్తి



సామర్లకోట ఈటీసీలో శిక్షణ పొందుతున్న సాధకులు

సామర్లకోట: పొలారిటీ ధ్యాన ప్రక్రియతో ప్రకృతిలోని పాజిటివ్ శక్తి లభిస్తుందని శిక్షణ నిర్వాహకులు శేఖర్‌బాబు, రాజీబాబు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఫ్యాకల్టీలు సాధకులకు శనివారం శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణ పొందిన వారు ఇతరులకు సులభంగా శిక్షణ ఇవ్వవచ్చునని తెలిపారు. పొలారిటీతో అనేక రకాల రోగాలు దూరం అవుతాయని పేర్కొన్నారు. ఈటీసీ ప్రిన్సిపాల్ జె వేణుగోపాల్ పరిశీలించగా ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, ఎస్‌కె మొహిద్దీన్‌తో పాటు ఆపద మిత్రలు శిక్షణ పొందారు.

విజయ సాధకులు మహిళలు



మెప్మా సభ్యులతో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర

పెద్దాపురం: మహిళలు తలుచుకుంటే ఎంతటి విజయమైనా సాధిస్తారని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ ఉత్సవ్-2023 నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ మెప్మా సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతులు చేసే వారిని గుర్తించాలన్నారు. శానిటరీ అధికారి దావీదురాజు మాట్లాడుతూ మహిళలు బాధ్యత తీసుకొని స్వచ్ఛ ఉత్సవ్-2023 విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మెప్మా సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నూకాలమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు పూర్తి

- వచ్చేనెల 3 వరకు ఉత్సవాలు
- నేటి రాత్రి నుంచి ప్రారంభం



కాండ్రకోటలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయం



సామర్లకోటలోని నూకాలమ్మ ఆలయం

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి 45 రోజుల నిర్వహించనున్నారు. సుమారు 500 ఏళ్ల నుంచి అమ్మవారి జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు అత్యంత విశ్వాసంతో అమ్మవారి జాతరకు వచ్చి మొక్కుబడులు తీర్చుంటారు. 1950లో దేవాలయాన్ని దేవదాయ శాఖకు అప్పగించడంతో ఆనాటి నుండి ఏటా ఆలయ కమిటీ ఏర్పాటై గరగల ఉత్సవం, జాతర మహోత్సవంతో పాటు 45 రోజుల పాటు తిరునాళ్లు నిర్వహిస్తారు. వచ్చే నెల మూడో తేదీ వరకు ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి 8.46 నిమిషాలకు ప్రారంభమయ్యే జాతర ప్రారంభోత్సవానికి ఎంపీ వంగా గీత, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే చినరాజప్పతో పాటు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయంలో ఆదివారం నుంచి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని గ్రామ దేవతగా కొలుస్తారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని నిర్వహించే ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న ఆలయాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు 32 ఏళ్ల క్రితం అమ్మవారికి నూతన ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ధర్మకర్తల ఆధ్వర్యంలో ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయ దేవస్థానం ఆధ్వర్యంలో పట్టణ పుర వీధులలో దివాన్ జాగరం జరిగింది. ఆదివారం సాయంత్రం గరగలతో బలుసులపేటలో నిర్వహించే చిన్న సంబరంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. సోమవారం రాత్రి ఆలయం ఆధ్వర్యంలో జాతర ఉత్సవం, మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనం, బుధవారం ఉగాది ఉత్సవం జరుగుతాయని ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. ఏప్రిల్ ఆరో తేదిన అమ్మవారికి కుంభాభిషేకం ఉంటుందని చెప్పారు. ఏడో తేదీన అమ్మవారిని నాణేలతో అలంకరించనున్నారు. నెల రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు జరుగుతాయని చెప్పారు. ఉత్సవాలు ముగిసిన తరువాత అన్నదానం జరుగుతుందన్నారు. ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సాయి ఆధ్వ ర్యంలో పూజలు జరుగుతాయి.



కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు



అమ్మవారి గరగల ఉత్సవం (ఫైల్)



పెద్దాపురంలో నూకాలమ్మ తల్లి

ఎడ్ల పోటీల 'సత్యేంద్రకుమార్' మృతి

- రాష్ట్రస్థాయి పందేల్లో అనేక బహుమతులు
- కుమార్‌కు నివాళులు అర్పించిన అభిమానులు



కుమార్‌కు నివాళులు అర్పించిన దొరబాబు

సామర్లకోట: ఎడ్ల పెంపకందారుడు, రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీల్లో అనేక బహుమతులు పొందిన వల్లూరి సత్యేంద్రకుమార్ (40) శనివారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందారు. రైతు కుటుంబానికి చెందిన కుమార్ మాండవ్యనారాయణ స్వామి ఆలయం వద్ద పాల డెయిరీ నిర్వహిస్తుంటారు. పదేళ్లుగా విశాఖ నుంచి కృష్ణా జిల్లా వరకు ఎక్కడ ఎడ్ల పరుగు పందేలు నిర్వహించిన దాదాపు 50 పరుగు పందేల్లో పాల్గొని అనేక బహుమతులు సాధించారు. సీనియర్ విభాగంలో 10, జూనియర్ విభాగంలో 10 ప్రథమ బహుమతులు సాధించారు. కుమార్ ఎడ్లు ప్రథమ బహుమతులు సాధించడాన్ని ఓర్చుకోలేని వ్యక్తులు కుమార్‌కు చెందిన రెండు జతల ఎడ్లకు మూడేళ్ల క్రితం విషం పెట్టి చంపిన విషయం తెలిసిందే. అయినా మరో రెండు జతల ఎడ్లను కొని వాటికి శిక్షణ ఇచ్చి ఏదో ఒక బహుమతి కైవసం చేసుకునే వారు. ఎడ్ల పెంపకానికి ఇబ్బందవుతుందని అతడు వివాహాన్ని సైతం చేసుకోలేదని స్థానికులు అంటున్నారు. కుమార్ మరణ వార్త తెలిసి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కౌన్సిలర్లు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మద్దాల శ్రీను, ఉమ్మడి జిల్లా నుంచి వందలాది మంది అభిమానులు సామర్లకోట వచ్చి కడసారి కుమార్ మృతికి సంతాపం తెలిపారు.



సత్యేంద్ర కుమార్ (పాత చిత్రం)

ఒత్తిడి లేకుండా పని చేయాలి

- సచివాలయ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ దారపురెడ్డి



సచివాలయ ఉద్యోగుల సంఘ వివరాలను మేనేజరుకు అందజేసిన నాయకులు

సామర్లకోట: సచివాలయాల్లో పని చేసే కార్యదర్శులు ఒత్తిడికి గురి కాకుండా పని చేయాలని సచివాలయ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ దారపురెడ్డి తాతాజీ, జిల్లా అధ్యక్షుడు బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్ అన్నారు. శనివారం సామర్లకోట వచ్చిన వారు ఇటీవల సామర్లకోట సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ మేరకు సమస్యలను జిల్లా యూనియన్ దృష్టికి తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ విభాగాలలో ఉన్న సమస్యలను రాష్ట్ర యూనియన్ గౌరవ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు నూతన కమిటీ వివరాలను మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజుకు అందజేశారు. స్థానిక సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా మేకా జోగారావు, ప్రధాన కార్యదర్శిగా సింగరాజు ఎన్నికైన విషయం విదితమే.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి



జగనన్న కాలనీలో కొత్త ఇంటిని ప్రారంభిస్తున్న దవులూరి

పెద్దాపురం: జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణ శివారు జి.రాగంపేట జగనన్న కాలనీలో శనివారం దూలం శ్రీను, జ్యోతి దంపతులు నిర్మించిన ఇంటిని ఆయన ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్‌తో కలసి కాలనీలో ఇళ్లను పరిశీలించారు. మాగాపు గోపు, సుందరెడ్డి రాజు, కందుల వెంకట్రావు, పెరుమాళ్ల శ్రీను, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

యండపల్లిలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కాలిపోయిన బంగారం, వెండి ఆభరణాలు

రూ.20 లక్షల ఆస్తినష్టం

కొత్తపల్లి: మండలంలోని యండపల్లిలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యండపల్లిలోని కొండా చంటిబాబుకు చెందిన తాటాకింట్లో అతని కుమారులు గనిబాబు, వీరబాబు కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. శనివారం వీరబాబు భార్య స్వర్ణలత వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఆమె భయభ్రాంతులకు గురై ఉయ్యాలలో ఉన్న ఏడాది బిడ్డను తీసుకుని బయటకు పరుగులు తీసింది. మంటలు వ్యాపించడంతో గనిబాబు ఇంటిలో ఉన్న గ్యాస్ సిలెండర్ ఒక్కసారిగా పేలింది. ఆ శబ్దానికి చుట్టుపక్కలు నివసిస్తున్నవారు సైతం పరుగులు తీశారు. వీరబాబు ఇంటిలో మామిడితోట పెట్టుబడి కోసం అప్పుచేసి తీసుకువచ్చిన రూ.5 లక్షలు, 10కాసుల బంగారం, గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. గనిబాబు ఇంట్లో సుమారు రూ.3.5 లక్షల నగదు, 3.5 కాసుల బంగారం, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. స్వర్ణలత పసిబిడ్డతో ఇంటి నుంచి పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలను పలువురు నాయకులు, అధికారులు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు.

డ్వామా అధికారులకు ముగిసిన శిక్షణ

సర్టిఫికెట్లు అందజేసిన డ్వామా ఏపీడీ రమేష్



శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేసిన ఏపీడీ రమేష్

సామర్లకోట: డ్వామా అధికారులకు మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ కోఆర్డినేటర్, డ్వామా ఏపీడీ జి.రమేష్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పని చేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓ, ఏసీ, టెక్నికల్ అసిస్టెంట్లకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన అంశాలపై అభ్యర్థుల నుంచి సమాచారం సేకరించారు. డ్వామాలో రూపొందించిన కొత్త సాఫ్ట్‌వేర్, పనుల్లో నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, చేయవలసిన పనులపై మూడో రోజు శిక్షణ ఇచ్చారు. మూడు రోజుల శిక్షణకు తొమ్మిది జిల్లాల నుంచి 56 మంది హాజరయ్యారు. రిసోర్సుపర్సన్లు బి.శ్వేత, కె.రాజేశ్వరి, కేవీవీ సత్యనారాయణ, జీటీఎస్ సాగర్, వి.సురేష్ కుమార్, ఎం.సత్యనారాయణ, ఎస్.నరేష్‌బాబు, ఎస్.శ్యామల శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



మహారాణి కళాశాల షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న దొరబాబు

పెద్దాపురం: విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మహారాణి కళాశాల ఎదురుగా పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో నిర్మించిన నూతన షాపింగ్ కాంపెక్స్ నిర్మాణాన్ని శనివారం ఆయన లలితా ఇండస్ట్రీస్ అధినేత మట్టే సత్యప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థులందరూ కళాశాల అభివృద్ధికి షాపింగ్ కాంపెక్స్ నిర్మాణానికి సహకరించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు వసతుల కల్పనతో పాటు షాపింగ్స్ నుంచి వచ్చే ఆదాయాన్ని కళాశాల అభివృద్ధికి వినియోగించాలని దొరబాబు సూచించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, పసల పద్మరాఘవరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆయన స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వ్యాపార వుంతలోని సత్తెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు.

భారత్ గౌరవ్ రైలుకు ఘన స్వాగతం



సామర్లకోట వచ్చిన భారత్ గౌరవ్ టూరిస్టు ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట: వివిధ రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖ పుణ్య క్షేత్రాలను దర్శించుకునేలా దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసిన భారత్ గౌరవ్ టూరిస్టు ఎక్స్‌ప్రెస్ రైలుకు శనివారం రాత్రి సామర్లకోటలో స్థానిక రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. శనివారం సికింద్రాబాద్‌లో బయలుదేరిన రైలు 22వ తేది వారణాసి చేరుతుంది. పూరి, కాశీ, అయోధ్య యాత్రల కోసం ఈ రైలును ఏర్పాటు చేసినట్లు స్థానిక రైల్వే మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. 14 బోగీలతో యాత్రికుల కోసం రైలులో ఏడు స్లీపర్ కోచ్‌లు, మూడు ఏసీ కోచ్‌లు, ఒక సెకండ్ ఏసీ కోచ్ ఉంటాయని తెలిపారు. యాత్రికులు ఆన్‌లైన్‌లో మాత్రమే టిక్కెట్లు తీసుకోవలసి ఉంటుందన్నారు. సామర్లకోట వచ్చిన రైలుకు రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు సంతోష్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ఏడీఈఎన్ శివప్రసాద్, చీఫ్ టిక్కెటు ఇన్‌స్పెక్టరు రామకృష్ణ, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.శివరామకృష్ణ, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు స్వాగతం పలికారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



రవీంద్రపురంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ, నాయకులు

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ కారే సుధ అన్నారు. మండలంలోని కొత్తపల్లి శివారు రవీంద్రపురంలో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకుకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, ఎంపీడీఓ భాస్కరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్, పొన్నగంటి రామకృష్ణ, మాదాబత్తుల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వాహణలో ప్రతిభ చూపిన మహిళలకు పురస్కారాలు ఇవ్వడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడిచెత్త వినియోగం వంటి విభాగాల్లో వీటిని అంద జేయాలన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 22వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని యండపల్లికి చెందిన కొండ చంటిబాబు, కొండ గన్నిబాబు, కొండ వీరబాబు నివసిస్తున్న తాటాకిల్లు ఇటీవల ప్రమాదవశాత్తూ కాలిపోయింది. కాగా బాధిత కుటుంబాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఉప సర్పంచ్ గుండ్ర చిన్నారావు, గుండ్ర జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

పిఠాపురం: చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన అల్లాడ వెంకన్నదొర (23) సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో 4వ సంవత్సరం చదువుతున్నాడు. తనకు 2, 3 ఇంజినీరింగ్ సెకండ్, థర్ ఇయర్ పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని మనస్తాపం చెంది ఈ నెల 13న ఎలుకల మందు తాగాడు. అస్వస్థతకు గురైన దొరను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీనిపై ఎస్సై వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కలశ స్థాపన



ఆలయంపై కలశాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

పిఠాపురం: స్థానిక కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం కలశస్థాపన మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి కలశాన్ని పునఃప్రతిష్ఠించారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాసరావు, ఆగంటి ప్రభాకరరావు, బాదం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



హాస్టల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెద్దాపురం: పట్టణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు శనివారం ఎస్ఎఫ్ఐ విద్యార్థులు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆయా వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ సహకారంతో ఈ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీసీ డబ్ల్యూ రాజేశ్వరి, శ్రీవల్లి, ఎస్ఎఫ్ఐ నాయకులు టి.రాజా, శివమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్షిస్తున్న చైర్‌పర్సన్ మంగతాయారు

పిఠాపురం: ప్రస్తుత వేసవిలో గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు తెలిపారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రజలకు తాగునీటి సరఫరాపై అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. శివారు ప్రాంతాలకు 54 రోజుల పాటు 3 ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. దీని కోసం సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. జగనన్న కాలనీ వాసులకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేవిధంగా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు.